మితిమీరుతున్న మందుబాబులు

- చిన్న ములగాడ జంక్షన్‌లో ఆకతాయి చేష్టలు
- మద్యం తాగుతూ మహిళలతో అసభ్యకర ప్రవర్తన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానిక మహిళలు





మందుబాబులకు అడ్డాగా మారిన చిన్న ములగాడ జంక్షన్

మల్కాపురం: ఒక నాడు ఎంతో ప్రశాంతంగా ఉండే చిన్న ములగాడ జంక్షన్.. నేడు మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ రాత్రి వేళల్లో వారి ఆగడాలు ఎక్కువయ్యాయి. సర్వీస్ రోడ్డుపై బహిరంగంగా మద్యం, గంజాయి సేవిస్తూ.. ఆ మార్గాన వచ్చే మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తుండటంతో పోలీసులు కదిలి వచ్చారు. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు.

ఎక్కడి నుంచో వచ్చి.. ఆగడాలు

జీవీఎంసీ 58వ వార్డు చిన్న ములగాడలో సుమారు 1,500 మంది జనం నివసిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంత పరిధిలో ఎంతో ప్రశాంతంగా ఉండే ఈ గ్రామానికి కొత్త సమస్య వచ్చిపడింది. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో భాగంగా వివిధ కాంట్రాక్టర్లు బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులను తీసుకొచ్చి, వారికి ఈ గ్రామంలోని రేకుల షెడ్ల వద్ద ఆశ్రమం కల్పిస్తున్నారు. వీరు ఉదయం విధులకు వెళ్లి రాత్రి ఇళ్లకు తిరిగి వచ్చినప్పుడు గుంపులుగా ఏర్పడి ములగాడ సర్వీస్ రోడ్డులోని దుకాణాల వద్ద, గెడ్డపై గల గట్టుపై కూర్చుని బహిరంగంగా మద్యం తాగుతున్నారు. ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ ఆకతాయి చేష్టలకు పాల్పడుతున్నారు. ఆ మార్గాన ఎవరైనా మహిళలు వస్తే వారితో అసభ్యకరంగా ప్రవర్తించడం వంటివి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వీరికి ములగాడ జంక్షన్ వద్ద గల పలు వాణిజ్య దుకాణదారులు మద్యం, సిగరెట్, గుట్కా, ఖైనీ వంటివి విక్రయిస్తున్నారు. తమ ఇంటికి దగ్గరలోనే వీరికి మద్యం దొరుకుతుండటంతో అక్కడే మద్యం తాగుతూ విచ్చలవిడి తీరులో నార్త్ నుంచి వచ్చిన యువకులు మితిమీరి ప్రవర్తిస్తున్నారు.

మహిళల ఫిర్యాదు.. రంగంలోకి పోలీసులు

మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులకు గురవుతున్న చిన్న ములగాడ మహిళలు ఐక్యంగా ఓ సమావేశం ఏర్పాటు చేసి.. ఈ సమస్య పరిష్కారంపై చర్చించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి మద్యం విక్రయిస్తున్న దుకాణదారులను ప్రశ్నించడంతో పాటు గాజువాక పోలీసులకు సమస్యను వివరించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం పోలీసులు చిన్న ములగాడ జంక్షన్ ప్రాంతానికి వచ్చి అక్కడి దుకాణాలను క్షుణంగా పరిశీలించారు. ఆకతాయిలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఈ సమస్యకు కారకులైన కార్మికులు చిన్న ములగాడ ప్రాంతానికి రాకపోవడంతో వారి కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు.



స్థానిక మహిళల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు



చిన్న ములగాడ జంక్షన్ వద్ద దుకాణాన్ని తనిఖీ చేస్తున్న గాజువాక పోలీసులు

క్లుప్తంగా

ఘనంగా విశ్వకర్మ పూజలు



అన్నప్రసాదం వడ్డిస్తున్న షణ్ముఖరావు

మర్రిపాలెం: విశ్వకర్మ జయంతి సందర్భంగా శనివారం ఘనంగా పూజలు చేశారు. మర్రిపాలెం ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో మహా అన్నదానం నిర్వహించారు. సీనియర్ డీఈ ఆర్ షణ్ముఖరావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్మికుల సొంత ఖర్చులతో విశ్వకర్మ పూజ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు, కమిటీ సభ్యులు, సుమారు వెయ్యి మంది వరకు ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లీ హెల్త్ డొమైన్స్, లీ ఫార్మా లిమిటెడ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌తో పాటు 147 మంది ఉద్యోగులు పరీక్షలు చేయించుకున్నారు. లీ ఫార్మా డైరెక్టర్ అల్లా లీలా రాణి, క్యాంప్ కో–ఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, డాక్టర్ రాధిక, పోషకాహార నిపుణురాలు మాధురి, జి.ఎన్.ఎం. భాగ్యలత సేవలందించారు. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఏవో బి.వి.రాణి, ఏపీఆర్ఎస్ఏ ప్రతినిధులు రాజేంద్రవర్మ, త్రినాథ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

28న పౌర ప్రజా సంఘాల సదస్సు

బీచ్‌రోడ్డు: మహాత్మా జ్యోతిబాపూలే సత్యసాధక సమాజ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఈనెల 28వ తేదీన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు–ప్రజా ఉద్యమ కర్తవ్యాలపై పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ తెలిపారు. సంబంధిత కరపత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 ఏళ్ల కాలంలో దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ కులాల పేరుతో ప్రజలను మధ్య యుగం నాటి కాలానికి తీసుకువెళ్లే ప్రయత్నం విస్తృతంగా చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు నెయ్యిలా నాగభూషణరావు, లలిత, పద్మ, అనురాధ రామకృష్ణ, లక్ష్మీ తిరుపతిరావు, శివలక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు

వచ్చే నెల 12న వైజాగ్ హాఫ్ మారథాన్

డాబాగార్డెన్స్: వైజాగ్ ట్రయల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న వైజాగ్ హాఫ్ మారథాన్ 4వ ఎడిషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు, రేస్ డైరెక్టర్ డాక్టర్ కె.కృష్ణచైతన్య తెలిపారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గీతం కాలేజీ నుంచి ఈ మారథాన్ కార్యక్రమం ఉంటుందని, పోటీలో నాలుగు విభాగాలు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొనే ఆసక్తి గల వారు ముందుగా తమ పేర్లను www.vtra.run ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

చిరు వ్యాపారులపై ప్రతాపం

- కంచరపాలెం – ఊర్వశి జంక్షన్ రహదారుల్లో దుకాణాల తొలగింపు
- రోడ్డున పడ్డామంటూ బాధితుల ఆవేదన



ఊర్వశి జంక్షన్ రహదారిలో బడ్డీలు తొలగిస్తున్న సిబ్బంది



రహదారిలోని దుకాణాలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధి 54, 56 వార్డుల్లోని కంచరపాలెం నుంచి ఊర్వశి జంక్షన్ రహదారిలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, టీపీవో ప్రవీణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో సిబ్బంది శనివారం ఉదయం 9 గంటల నుంచి ఉత్తర నియోజకవర్గ పరిధి ఊర్వశి కూడలి జాతీయ రహదారి నుంచి కంచరపాలెం ముత్యమాంబ ఆలయం వరకు, మధ్యాహ్నం పశ్చిమ నియోజకవర్గంలోని కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి ఊర్వశి జంక్షన్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా మార్గాల్లో ఫుట్‌పాత్, రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు, టీ, షాప్ కౌంటర్లు, డిస్‌ప్లే బోర్డులు, దుకాణాల మెట్లు, షాపుల ముందు ఐరన్ గ్రిల్స్, షెడ్లను తొలగించి.. చిరు వ్యాపారులపై తమ ప్రతాపం చూపారు. ఉన్నపళంగా తమ జీవనాధారమైన దుకాణాలను తొలగించడంతో రోడ్డున పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డ్రైవ్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, చైన్‌మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారుల నిరసన ర్యాలీ



గోపాలపట్నంలో నిరసన ర్యాలీ చేస్తున్న తోపుడు బండ్ల సంఘం నాయకులు

గోపాలపట్నం: రహదారులు, ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్ల దుకాణాలను తొలగించడంపై సీఐటీయూ, సీపీఎం నాయకులు, తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం సభ్యులు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. గోపాలపట్నం సీపీఎం కార్యాలయం నుంచి వేపగుంట జోనల్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలియజేశారు. పేదోళ్ల కడుపు కొట్టే చర్యలు మానుకోవాలని వేడుకున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించి, దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని వాపోయారు. చిల్లర వర్తకుల కోసం హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ఏవిధమైన చర్యలు చేపట్టకుండా ఏకపక్షంగా తొలగింపులు చేయడం దారుణమని వాపోయారు. అనంతరం జోనల్ కార్యాలయంలో జెడ్సీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గోపాలపట్నం తోపుడు బండ్ల సంఘం అధ్యక్షుడు జి.మురళి, సీఐటీయూ నాయకురాలు అనసూయ, సీఐటీయూ జిల్లా నాయకుడు పి.వెంకటరెడ్డి, చిల్లర వర్తకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్ల ధర్నా



డైమండ్ పార్క్ వద్ద ధర్నా చేస్తున్న స్విగ్గీ, జొమాటో రైడర్లు, యూనియన్ నాయకులు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ స్విగ్గీ, జొమాటో రైడర్లు శనివారం నగరంలోని అక్కయ్యపాలెం, ద్వారకానగర్, డైమండ్ పార్క్, మధురవాడ, గాజువాక, ఎన్ఏడీ, పెందుర్తి సమీపంలో ధర్నా చేశారు. డైమండ్ పార్క్ వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైడర్లు పాత జీతాలు ఇమ్మని అడుగుతున్నారని, ఇది న్యాయమైన కోరికని, యాజమాన్యాలు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జొమాటో సంస్థ ఈ ఏడాది రూ.974 కోట్ల లాభాలు ఆర్జించిందని, దాని వెనుక రైడర్ల కష్టం ఉందన్న విషయం మర్చిపోకూడదన్నారు. గిగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మంది యువత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫారాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే మినిమం గ్యారంటీ ఆదాయం చెల్లించాలని, గతంలో ఇచ్చినట్లు పీక్, నాన్ పీక్‌లు ఇవ్వాలని కోరారు. రైడర్‌కు సమస్య వస్తే పరిష్కరించే రిప్రజెంటేటివ్ కావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.వి.నరసింహులు, విశాఖ క్యాబ్ యూనియన్ ఉపాధ్యక్షుడు సి.ఎం.శ్రీను, వెంకటేష్, మురళి, కె.ఎం.కుమార్ మంగళం, శ్రీనివాస్, అచ్యుత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జోరువాన



బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో కురుస్తున్న వర్షం

గోపాలపట్నం: శనివారం ఉదయమంతా ఎండ ఉక్కపోత.. 11.45 గంటల వరకు ఇదే పరిస్థితి.. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి మబ్బులు కమ్ముకున్నాయి. చిరుజల్లు తరువాత జోరువాన మొదలైంది. మధ్యాహ్నం అకస్మాత్తుగా కురిసిన వర్షంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఎన్ఏడీ జంక్షన్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి వాహనాలతో నిండిపోయింది. వర్షం తగ్గిన తరువాత తిరిగి బయలుదేరారు. రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం పడినంత సేపు రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి.

శాస్త్రీయ, ఆధ్యాత్మిక మ్యూజియం నిర్మాణానికి వినతి

డాబాగార్డెన్స్: సింహాచలం కొండపై శాస్త్రీయ, ఆధ్యాత్మిక విజ్ఞానంతో కూడిన మ్యూజియం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ప్రతినిధి రామేశ్వరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మ్యూజియం ఏర్పాటుకు గత ఏడాది అక్టోబర్ 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మరలా ఈ నెల 4న కేబినెట్ అనంతరం ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినట్టు చెప్పారు. విశాఖలో ఇలాంటి శాస్త్రీయ ఆధ్యాత్మిక మ్యూజియం నిర్మించడం అవసరమన్నారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత



గోపాలపట్నం హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపరింటెండెంట్ సుజాత



59వ వార్డులో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు



58వ వార్డులో హైస్కూల్ వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

గోపాలపట్నం: స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం పలు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో వైద్యులు, సిబ్బంది స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతగా భావించాలని హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ సుజాత అన్నారు. ఆస్పత్రికి వచ్చేవారు పరిశుభ్రత పాటించాలని కోరారు. 92వ వార్డు పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సూచనలు, మందులు అందించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, స్థానిక నాయకుడు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు..

మల్కాపురం: 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమార్, ప్రకాష్, స్థానిక కూటమి నాయకులు కోరాడ శ్రీను, పొత్తబత్తుల శ్రీను, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి తదితరులు మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

- 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని అండాలమ్మ కళాశాల మైదానం వద్ద మొక్కలు నాటారు. కళాశాల అధ్యాపకులు, స్థానిక కూటమి నాయకులు, శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

భక్త సిరి.. సాగరగిరి

- యారాడ కొండపై కొలువై ఉన్న సాగర గిరి కనకదుర్గమ్మ
- నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి పూజలకు సర్వం సిద్ధం
- 22 నుంచి అక్టోబర్ 2 వరకు బోటు సౌకర్యం



విశేష అలంకరణలో సాగర గిరి దుర్గమ్మ

సాగరి గిరి దుర్గమ్మ కొలువై ఉన్న యారాడ కొండ (డాల్ఫిన్ నోస్)

అల్లిపురం: నగరవాసులకు బోటు ఎక్కే అవకాశం సాగర గిరి కనకదుర్గమ్మ కల్పించింది. ఏడాది పాటు బోటు ఎప్పుడు ఎక్కుదామా అని ఎదురు చూసే వారికి ఆ అవకాశం రానే వచ్చింది. మరింకెందుకు ఆలస్యం బోటు ఎక్కేద్దామా.. సాగర గిరి కనకదుర్గమ్మను చూసొచ్చెద్దామా.. సిద్ధం కండి.

ఉత్సవాలకు సర్వం సిద్ధం..

దసరా ఉత్సవాలకు యారాడ కొండ ముస్తాబయింది. ఈ మేరకు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాగర గిరి కనక దుర్గమ్మ గుడి కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు కలశ ప్రతిష్టతో అమ్మవారి నవరాత్రులు ప్రారంభమవుతాయి. 22న బాలాత్రిపుర సుందరిగా, 23న గాయత్రీదేవిగా, 24న రాజరాజేశ్వరీదేవిగా, 25న లలితాదేవిగా, 26న మహాలక్ష్మీదేవిగా, 27న భువనేశ్వరీదేవిగా, 28న అన్నపూర్ణాదేవిగా, 29న సరస్వతీదేవిగా, 30న చండీదేవిగా, అక్టోబర్ 1వ తేదీన శాకంబరీదేవిగా, 2వ తేదీన సాగర గిరి కనక దుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

సాగర గిరి దుర్గమ్మ చరిత్ర ఘనం..

పోర్టు నిర్మాణం సమయంలో (1970)లో యారాడ కొండపై సాగరదుర్గను నెలకొల్పారు. పెద్ద నౌకలు వచ్చేందుకు వీలుగా నేచురల్ హార్బర్ అయిన డాల్ఫిన్ నోస్ వద్ద పోర్టు కాంట్రాక్టర్ తవ్వకాలు జరుపుతుండగా ఒక రోజు కాంట్రాక్టర్‌కు అమ్మవారు కలలో కనిపించి వారు తవ్వకాలు జరుపుతున్న చోట తన విగ్రహం ఉందని తెలిపింది. అమ్మవారు చెప్పిన ప్రాంతంలో తవ్వుతుండగా అమ్మవారి విగ్రహం కనిపించింది. దీంతో పండితులు, పీఠాధిపతుల సూచనల మేరకు యారాడ కొండపై సముద్ర మట్టానికి 200 మీటర్ల ఎత్తులో ఆలయం నిర్మించి అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. యారాడ కొండపై ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారి దేవాలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అమ్మవారి దేవాలయం చుట్టూ భారతదేశంతో వివిధ ప్రాంతాలలో పూజలందుకుంటున్న అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో శివాలయం, నవగ్రహాలు, వినాయకుని ఆలయాలు ఉన్నాయి.

భక్తుల దర్శనార్థం బోటు సౌకర్యం..



బోటు ప్రయాణం

సాగర గిరి కనకదుర్గ దేవాలయానికి నగరం నుంచి వెళ్లాలంటే సాగరాన్ని దాటాల్సి ఉంటుంది. అక్కడికి చేరుకోవడానికి నగరం నుంచి రోడ్డు మార్గం లేదు. పోర్టు అథారిటీ అనుమతితో బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు బోటు యజమాని గుప్త తెలిపారు. ప్రతి రోజు పాత పోస్టాఫీసు దరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద గల ఫెర్రీ నుంచి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోటు సౌకర్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20గా టికెట్టు నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కూటమి మోసాలను మహిళలకు వివరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్న

కంచరపాలెం: కూటమి మోసాలను మహిళలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న కోరారు. జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలో గల పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేరకు పార్టీ మహిళలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వార్డుల్లో మహిళా విభాగం బూత్ స్థాయిలో బలోపేతం అవడానికి అందరూ కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, నేడు కూటమి ప్రభుత్వంలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయకుండా సూపర్ సిక్స్ అయిపోయిందని చెప్పడం మోసపూరితమని తెలిపారు. కార్యక్రమంలో ఆయా వార్డు అధ్యక్షులు చిన్నారి, సావిత్రి, కళ, రాజ్యం పాల్గొన్నారు.